వేగంగా రోడ్డు విస్తరణ

• బీర్కూర్‌లో రూ.7.20 కోట్లతో కొనసాగుతున్న పనులు



తొలగించిన ఇళ్లు, దుకాణాలు



బీర్కూర్‌లో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు

బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో ఆలోపే పనులు పూర్తి చేయాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచించడంతో పోచారం సురేందర్‌రెడ్డి నిత్యం పనులను పర్యవేక్షిస్తు వేగంగా సాగేలా చూస్తున్నారు. రోడ్డు విస్తరణ, డివైడర్ నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ కోసం స్పీకర్ రూ.7.20 కోట్ల నిధులు మంజురు చేశారు. బాన్సువాడ–బీర్కూర్– పాతంగల్ ప్రధాన రహదారి 1.4 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారు. రోడ్డు మధ్యలోంచి ఇరువైపులా 43 ఫీట్ల మేర విస్తరిస్తుండటంతో రోడ్ల పక్కన ఉన్న దుకాణాలు, ఇళ్లను యజమానులు తొలగించుకుంటున్నారు. రోడ్డుకు ఇరువైపులా విస్తరణ చేపడుతుండడంతో కామప్ప చౌరస్తా, మల్లాపూర్ చౌరస్తా, బస్టాండ్, నస్రూల్లాబాద్ ఎక్స్ రోడ్ వరకు విశాలంగా కనిపిస్తుంది. ప్రస్తుతం రోడ్డుకు ఇరువైపుల జేసీబీతో తవ్వి మొరం వేస్తున్నారు.

ట్రాఫిక్ సమస్యలకు చెక్

మండల కేంద్రంగా ఉన్న బీర్కూర్‌లో 20 వేల జనాభా ఉంటుంది. బిచ్కుంద, జుక్కల్, మద్నూర్, దెగ్లూర్ మండలాల ప్రజలు నిజామాబాద్, బోధన్, బాన్సువాడకు బీర్కూర్ నుంచే వెళ్తుంటారు. దీంతో గ్రామంలో నిత్యం రద్దీగా ఉంటుంది. దీంతో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే ట్రాఫిక్ సమస్యలకు కొంత మేర చెక్ పడనుంది.

కల నెరవేరుతుంది



బీర్కూర్‌లో రోడ్డు వెడల్పు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడ్డాం. కామప్ప చౌరస్తా వద్ద ప్రమాదాలు జరిగేవి. ప్రస్తుతం విస్తరణ పనులు జరుగుతుండటంతో బీర్కూర్‌వాసుల కల నెరవేరుతుంది.

– సంపత్‌కుమార్, బీర్కూర్

పనులు సాగుతున్నాయి



బీర్కూర్‌లో రోడ్డు విస్తరణ పనులు వేగంగా సాగుతున్నాయి. చాలా రోజులుగా ఉన్న పెద్ద సమస్య తీరనుంది. నిధులు మంజూరు చేసిన స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి కు ధన్యవాదాలు.

– శశికాంత్, బీర్కూర్

వైజ్ఞానిక రంగంలో సత్తా చాటిన భారత్



మాట్లాడుతున్న కుషాల్

బాన్సువాడ: చంద్రయాన్–3 విజయవంతంతో వైజ్ఞానిక రంగంలో భారత్ తన సత్తా చాటిందని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుషాల్ అన్నారు. గురువారం పట్టణంలోని కోనా బాన్సువాడ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న లక్ష్య ఉన్నతి మూడు రోజుల శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. చంద్రయాన్–3 చంద్రుడిని చేరడంతో ఉపాధ్యాయులకు స్వీట్లు పంపిణీ చేశారు. కోర్టు కేసులు పరిష్కారం కాగానే పదోన్నతులు, బదిలీల ప్రక్రియ చేపట్టే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని, ఈహెచ్ఎస్ హెల్త్ స్కీం త్వరలోనే అందుబాటులోకి వస్తుందన్నారు. నర్వ శ్రీనివాస్, మంద ప్రవీణ్, నార్య, లక్క నరహరి, వెంకగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, దాసరి రవీందర్, నక్క ప్రవీణ్, హన్మండ్లు ఉన్నారు.

బీజేపీ నాయకుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

బాన్సువాడ: బీజేపీ నాయకులపై అక్రమ కేసులు నిరసిస్తూ గురువారం బాన్సువాడలో బీజేపీ నాయకులు రాస్తారోకో చేపట్టారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బాన్సువాడలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడిస్తే నాయకులపై పోలీసులు అక్రమంగా కేసులు పెట్టారని ఆరోపించారు. పైడిమల్ లక్ష్మీనారాయణ, హన్మండ్లు, శంకర్‌గౌడ్, కోనాల గంగారెడ్డి, చీకట్ల రాజు, కిషన్, కొండని గంగారం, శంకర్, సాయికిరణ్, రాజాసింగ్, అశ్విన్, శ్యాం, సాయిబాబా, లక్ష్మణ్, దత్తు పాల్గొన్నారు.

ఓటరు నమోదు పకడ్బందీగా చేపట్టాలి



మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి



నస్రుల్లాబాద్‌లో తహసీల్దార్ రాజు..



నిజాంసాగర్‌లో తహసీల్దార్ భిక్షపతి

కామారెడ్డి క్రైం: ఓటరు నమోదు కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ నెల 26, 27, సెప్టెంబర్ 2, 3 వ తేదీల్లో బూత్ లెవల్ అధికారులు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. గురువారం కామారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులకు, పర్యవేక్షకులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడారు. బూత్ లెవల్ అధికారులు ఫారం 6, 7, 8 లను ప్రజల నుంచి స్వీకరించాలన్నారు. ఓటర్ జాబితాలో ఉన్న 80 సంవత్సరాల పైబడిన వృద్ధులను, దివ్యాంగులను గుర్తించాలన్నారు.

నస్రుల్లాబాద్: నస్రుల్లాబాద్ రైతు వేదికలో గురువారం తహసీల్దార్ రాజు బూత్ లెవెల్ ఆఫీసర్లకు ఓటరు నమోదు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఓటరు నమోదు, తొలగింపు ఫామ్‌లను అందించారు. ఈ నెల 26, 27, సెప్టెంబరు 2, 3 తేదీల్లో ప్రతి గ్రామంలోను ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టాలని సూచించారు. ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, గిర్దావార్ అంజు, ఎంపీవో రాము, వ్యవసాయ అధికారి నరేంద్ర పాల్గొన్నారు.

నిజాంసాగర్: ఓటరు జాబితాలో తప్పులను సరిచేస్తూ, అర్హత కల్గిన వారిని ఓటరుగా నమోదు చేయించాలని తహసీల్దార్ భిక్షపతి సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌వోల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సదుపాయం కల్పించాలన్నారు. ఎంపీడీవో నాగేశ్వర్, ఎంపీవో అబ్బాగౌడ్, గిర్దావర్ బాను ఉన్నారు.

దోమకొండ: అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటరుగా నమోదుకు అవకాశం ఉందని తహసీల్దార్ సంజయ్‌రావు అన్నారు. గురువారం తహసీల్ కార్యాలయంలో నూతనంగా బీఎల్‌వోలుగా నియమితులైన అంగన్‌వాడి టీచర్లకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. డిప్యూటీ తహసీల్దార్ కౌశిక, ఆర్ఐ మహేందర్ పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట: ఈ నెల 26, 27, వచ్చే నెల 2,3 తేదీల్లో ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాలను నిర్వహించాలని ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ సూచించారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బీఎల్‌వోలతో ఆయన సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మహేందర్ కుమార్, ఎంపీడీవో రఘు, ఎంపీవో శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ రాందాస్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పార్ట్‌టైం స్వీపర్ల దీక్ష



రిలే దీక్షలు చేపడుతున్న పార్ట్‌టైం స్వీపర్లు

కామారెడ్డి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లను రెగ్యులర్ చేయాలని కామారెడ్డి ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే దీక్షలు గురువారం నాటికి 60వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 40 ఏళ్ల నుంచి పనిచేస్తుంటే కేవలం రూ.4 వేల వేతనం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్హత ఉన్నవారికి అటెండర్‌లుగా నియమించాలన్నారు. సిద్దిరాములు, సాయన్న, సరోజన, మల్లేషం, నారాయణ, అశోక్, ఫాతిమాబీ, గంగారాం, గంగయ్య ఉన్నారు.

హాస్టల్ పరిశీలన



భిక్కనూరు: స్థానిక ప్రభుత్వ హాస్టల్‌ను గురువారం అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. హాస్టల్ రూపు రేఖలు గతంలో కంటే ఇప్పుడు పూర్తిగా మారిపోవడం చూసి ఆనందం వ్యక్తం చేశారు. వార్డెన్ సునీతతోనే ఇది సాధ్యమైందని సన్మానించారు. ఎంపీపీ గాలి రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహరెడ్డి, ఎంపీడీవో అనంత్‌రావు, ఎంపీవో ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ తుక్కి వేణు, మాజీ సర్పంచ్ నాగభూషణంగౌడ్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



నాగిరెడ్డిపేట: మండలంలోని చీనూర్, గోపాల్‌పేట, నాగిరెడ్డిపేట గ్రామాల్లో గల పోలింగ్ కేంద్రాలను గురువారం ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ పరిశీలించారు. ఓటర్ల వివరాలను స్థానిక రెవెన్యూ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ మహేందర్ కుమార్, ఆర్ఐ ప్రసాద్ ఉన్నారు.

ప్రకాశ్‌మణి దాదీ స్మృతి దివస్



కామారెడ్డి అర్బన్: ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఓం శాంతి కామారెడ్డి కేంద్రంలో గురువారం ప్రకాశ్‌మణి దాదీ స్మృతి దివస్ నిర్వహించారు. నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి కేంద్రాల ఇన్‌చార్జి జయదిదీ మాట్లాడుతు.. దాదీ ప్రకాశ్‌మణి లక్షాలాది కుటుంబాల్లో ఆత్మీయత నింపారన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

సదాశివనగర్: మండలంలోని జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న హోటళ్ల నిర్వాహకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై రాజు సూచించారు. హోటళ్ల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.



గజ్యానాయక్ తండాలో తీజ్ పండుగలో యువతులతో బీజేపీ నాయకుడు వెంకటరమణారెడ్డి

ఘనంగా తీజ్



కన్నాపూర్ తండాలో..

రామారెడ్డి: మండలంలోని కన్నాపూర్ తండాలో తీజ్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువతులు గోధుమ బుట్టలకు పూజలు చేసి, చెరువులో నిమజ్జనం చేశారు. సర్పంచ్ చందర్‌నాయక్, ఉపసర్పంచ్ శర్మనాయక్ పాల్గొన్నారు.

మాచారెడ్డి: మండలంలోని గజ్యానాయక్ తండా, మైసమ్మ చెరువు తండాల్లో తీజ్ పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణరెడ్డి పాల్గొని గిరిజనులతో నృత్యం చేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆధ్యాత్మికం

సాయి ఆలయంలో పూజలు



కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండలం ఉగ్రవాయి శివారులోని సాయి మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. సర్పంచ్ జూకంటి సుమితా జనార్దన్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు బచ్చు విజయ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాస్, మల్లయ్య, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బగలాముఖీ పీఠం వార్షికోత్సవాలు

ఎల్లారెడ్డి: పట్టణంలోని బగలాముఖీ అమ్మవారి పీఠంలో గురువారం వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించినట్లు జ్యోతిష్య పండితుడు క్రాంతి కుమార్ తెలిపారు. పీసీసీ కార్యదర్శి సుభాష్‌రెడ్డి, పీఠం నిర్వాహకులు సతీష్, రేవంతప్ప, ఒర విఠల్, హన్మాండ్లు పాల్గొన్నారు.

బూర్గుల్ సాయిబాబా ఆలయంలో..

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని బూర్గుల్‌లో సాయిబాబ ఆలయం గురువారం భక్తులు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. స్థానిక నాయకుడు గుండు మహేందర్ అన్నదానం చేశారు.

శ్రీసిద్ధరామేశ్వరాలయంలో..



భిక్కనూరు: శ్రావణమాసం సందర్భంగా భిక్కనూరులోని శ్రీ సిద్ధరామేశ్వరాలయం గురువారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. గ్రామానికి చెందిన గంగెళ్లి జగదీశ్వర్–ఉమరాణి, వీరప్రసాద్–మౌనిక దంపతులు భక్తులకు అన్నదానం చేశారు.

ఉచిత వైద్య శిబిరాలు



బోర్లంలో విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లంలో గల బాలిక గురుకుల విద్యాలయంలో గురువారం హన్మాజీపేట్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రావన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. విద్యార్థినులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. 14 మందిని మెరుగైన వైద్యం కోసం వివిధ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. సీజనల్ వ్యాధులు, నివారణ చర్యల గురించి వివరించారు. ప్రిన్సిపల్ పద్మకుమారి, హెచ్ఈవో సాయిలు పాల్గొన్నారు.

టేక్రియాల్‌లో..

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్‌లో బాంబేక్లాత్ హౌస్, లయన్స్‌క్లబ్ ఆఫ్ కామారెడ్డి వారి సౌజన్యంతో ఆర్వీఎం ఆస్పత్రి లక్ష్మక్కపల్లి ఆధ్వర్యంలో గురువారం మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. 475 మందికి పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వివిధ వ్యాధులతో బాధపడుతున్న 96 మందికి ఆస్పత్రిలో వైద్యం అందించనున్నట్లు మార్కెటింగ్ మేనేజర్ మంచినీళ్ల లక్ష్మణ్, సంతోస్‌కుమార్, కనకయ్య తెలిపారు.

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలం అడివిలింగాలలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు సర్పంచ్ సువర్ణ తెలిపారు. పట్టణంలోని దేవి హాస్పిటల్ ఆధ్వర్యంలో గ్రామంలో 130 మందికి వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందించినట్లు తెలిపారు. వైద్యులు యశ్వంత్, మహిపాల్, పంచాయతీ కార్యదర్శి శంకరయ్య ఉన్నారు.

మండల సమాఖ్య కార్యవర్గం ఎన్నిక



ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

బాన్సువాడ రూరల్: ఐకేపీ బాన్సువాడ మండల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని గురువారం ఏపీఎం పద్మ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా దూదేకుల సఫీయాబేగం(సోమేశ్వర్), ఉపాధ్యక్షురాలిగా గాండ్ల అంబవ్వ(బోర్లం), కార్యదర్శిగా దేవారం నవనీత, సహాయ కార్యదర్శిగా మంజుల, కోశాధికారిగా దూడెపు సరిత ఎన్నికయ్యారు. అంతకు ముందు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. సీసీలు షాదుల్లా, అక్బర్, స్వప్న, అమృత, సాయిలు, జలదుర్గ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిర్మాణ కార్మికులకు బీమా పెంచాలి



బాన్సువాడ: భవన నిర్మాణ కార్మికులకు ప్రమాద బీమా రూ.10 లక్షలకు పెంచాలని ఏఐటీయుసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబాస్ రాములు అన్నారు. గురువారం బాన్సువాడలో సీపీఐ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడారు. అంత్యక్రియలకు రూ. 50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ బోర్డు నిధులు ఇతర శాఖలకు మళ్లించడం సరైన పద్ధతి కాదన్నారు. కార్మికులు గోపాల్, హన్మండ్లు, అశోక్, జగస్, శ్రీకాంత్, లక్ష్మి, సాయవ్వ ఉన్నారు.

మొక్కల పంపిణీ



బాన్సువాడ: బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో గురువారం మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ ఇంటింటికి మొక్కలను పంపిణీ చేశారు. ఇంటి పరిసరాల్లో మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షులు అంజిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్, కౌన్సిలర్లు లింగం, వెంకటేశ్, నర్సగౌండ, రవీందర్‌రెడ్డి, శివ ఉన్నారు.

'రానున్నది కాంగ్రెస్ పాలన'



ఎల్లారెడ్డి: రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ పాలన అని పీసీసీ కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో నాగిరెడ్డిపేట మండలం మాల్తుమ్మెద గ్రామానికి చెందిన పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరారు. జనార్దన్‌రెడ్డి, ధనంజయ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

రామారెడ్డి: కాంగ్రెస్ నేత సుభాష్‌రెడ్డి గురువారం కన్నాపూర్ తండాలో తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన సమక్షంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నర్సింలు పాల్గొన్నారు.

ప్రగతి స్కాలర్‌షిప్‌ల పంపిణీ



లింగంపేట: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు గురువారం బయోస్టార్ కంపెనీ యాజమాన్యం ప్రగతి స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న పది మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2500 చొప్పున స్కాలర్‌షిప్‌లు అందజేశారు. బయోజైమ్ ఫెస్టిసైడ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. బయోస్టార్ ఇండియన్ లిమిటెడ్ సేల్స్ మేనేజర్ కృష్ణారెడ్డి, హెచ్‌ఎం వహీద్‌సిద్దిఖీ, సర్దార్, దేవ్‌సింగ్ పాల్గొన్నారు.

పంటల పరిశీలన



గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలోని నేరల్, నేరల్ తండా, చద్మల్, చద్మల్ తండా గ్రామాల్లో గురువారం పర్యటించి క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించినట్లు ఏవో నరేష్ తెలిపారు. వరిలో కాండం తొలిచే పురుగు, మొక్కజొన్నలో కత్తెర పురుగు, కాండం తొలిచే పురుగు, సోయాబీన్‌లో రసం పీల్చే పురుగు ఆశించినట్లు గుర్తించామన్నారు. ఏఈవో హారతి, రైతులున్నారు.

కట్టకు మరమ్మతులు చేయిస్తాం



రామారెడ్డి: రామారెడ్డిలోని రంగ చెరువు అలుగు పక్కన గండి పడడంతో గురువారం ఎంపీపీ దశరథ్‌రెడ్డి పరిశీలించారు. ఫోను ద్వారా ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించారు. రంగు రవీందర్ గౌడ్, వైస్ ఎంపీపీ రవీందర్‌రావు, కాసర్ల రాజేందర్, రాజేందర్, నర్సారెడ్డి, లేగల మహిపాల్ పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘ సమావేశం

నస్రుల్లాబాద్: మండల కేంద్రంలోని రామాలయ కల్యాణ మండపంలో ముదిరాజ్ సంఘం మండల స్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. సభ్యులు మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత ముదిరాజ్‌లకు చేసిందేమి లేదని పార్టీకి వ్యతిరేకంగా పని చేయాలని నిర్ణయించామని సంఘ సభ్యులు పుట్ట భాస్కర్ తెలిపారు. సభ్యులు అరిగె సాయిలు, భాస్కర్, రాములు, దొంతురాం కాశీరాం, నాగేష్,సాయిలు పాల్గొన్నారు.

సంక్షిప్తం

హోమ్‌గార్డును అభినందించిన ఎస్పీ

పెద్దకొడప్‌గల్: చోరీ కేసులో నిందితుడిని పట్టుకున్న హోంగార్డు ఇల్లియాస్ ఘోరిని గురువారం ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి కామారెడ్డిలోని ఆయన కార్యాలయంలో అభినందించారు. మండల కేంద్రంలో మూడు రోజుల నుంచి జరుగుతున్న వరుస చోరీలను ఘోరీ ఛేదించారు. దీంతో ఎస్పీ రివార్డు అందజేశారని ఎస్సై కోనారెడ్డి తెలిపారు.

కళ్లకలక నివారణకు మందుల పంపిణీ

కామారెడ్డి అర్బన్: కళ్ల కలక నివారణకు జిల్లా కేంద్రంలోని ఆయుష్ ఆస్పత్రిలో హో మియో మందు పంపిణీ చేస్తున్నట్లు డాక్టర్ ఎన్ విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్పత్రి పనివేళల్లో కళ్లకలక మందును పొందవచ్చన్నారు.

క్రీడా సామగ్రి..

దోమకొండ: మండలంలోని అంచనూరుకు చెందిన యువకులకు గురువారం దోమకొండ ఉపసర్పంచ్ గజవాడ శ్రీకాంత్ క్రీడా పరికరాలు అందజేశారు. వాలీబాల్, నెట్, క్రికెట్ కిట్ అందజేశారు. సింగిల్‌విండో చైర్మన్ పన్యాల నాగరాజ్‌రెడ్డి, లక్ష్మణ్, బొమ్మెర శ్రీను, బురాని స్వామి, సంజీవ్‌రెడ్డి, నరేష్ ఉన్నారు.

పెరిగిన పింఛన్లు..

బాన్సువాడ రూరల్: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన దివ్యాంగులకు పెరిగిన పింఛన్ ప్రోసిడింగ్ కాపీలను మండల కార్యాలయంలో గురువారం ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. ఎంపీపీ నీరజా వెంకట్రాంరెడ్డి, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, ఆర్డీవో భుజంగరావు, ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ పద్మగోపాల్‌రెడ్డి, అంజిరెడ్డి, మోహన్‌నాయక్, కృష్ణారెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

లింగంపేట: మండలంలోని శెట్పల్లిసంగారెడ్డి గ్రామానికి చెందిన దివ్యాంగులకు పెరిగిన పింఛన్లను గురువారం సర్పంచ్ అనిల్‌రెడ్డి పంపిణీ చేశారు. ఎంపీటీసీ ఇందిరా, ఉపసర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, కిశోర్‌రెడ్డి, సాయికిరణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మిల్లెట్ చిక్కి..

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండలం దేవునిపల్లి, గర్గుల్, టేక్రియాల్, గంజ్ ఉన్నత పాఠశాల, లింగాయిపల్లి పాఠశాలల్లోని విద్యార్థులకు శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ వ్యవస్థాపకుడు శ్రీ మధుసూదనసాయి పుట్టినరోజును పురస్కరించుకుని గురువారం మిల్లెట్ చిక్కి, ఫోటో క్యాలెండర్‌లను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులకు చీరలను పంపిణీ చేశారు. ట్రస్ట్ అబ్జర్వర్ గురుమంచి సేనాపతి, ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్, గంగాకిషన్, రాజనర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు

నిజాంసాగర్: మండలంలోని ముగ్దుంపూర్‌లో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గురువారం పశువులకు టీకాలు వేశారు. సర్పంచ్ బీమన్‌పల్లి లక్ష్మీనారాయణ, పశువైద్యుడు సయ్యద్ యూనుస్, నారాయణ గోపాలమిత్ర రఘు ఉన్నారు.

నేడు భిక్కనూరులో బీజేపీ కార్యకర్తల సమావేశం

భిక్కనూరు: మండల కేంద్రంలోని ఎస్వీ గార్డెన్‌లో శుక్రవారం ఉదయం బీజేపీ మండల నేతల కార్యకర్తల సమావేశం మండలాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి అక్కల్‌కోట్ ఎమ్మెల్యే సచిన్ కల్యాణ్‌శెట్టి, బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కాటిపల్లి వెంకటరమణరెడ్డి హాజరవుతారని చెప్పారు.